www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 23 నవంబర్ 2024

5

కాకినాడ




## అదానీ కంపెనీతో ఒప్పందాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

సెకీ నుంచి రాష్ట్ర డిస్కాములు విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు అదానీ గ్రూపు భారీ ముడుపులు చెల్లించిన నేపథ్యంలో రాష్ట్రంలో అదానీ గ్రూపు కంపెనీ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. 2019-20 మధ్య సెకి ఒప్పందమే గాక రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టులను అదానీ గ్రూపు సంస్థలతో నాటి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుని ప్రభుత్వ ఆస్తులను, ప్రజల సంపదను వారికి ధారాదత్తం చేసిందని ఆయన విమర్శించారు. అదానీ గ్రూపు అక్రమాలకు నిరసనగా అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా అంతటా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయాలని ఆయన కోరారు.

# అందని వేట నిషేధ పరిహారం

- ఆరు నెలలైనా అతీగతీ లేదు
- కూటమి సర్కారు నిర్లక్ష్యం మత్స్యకారులకు
- తప్పని ఎదురు చూపులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం నేటికీ అందలేదు. ఆరు నెలలు కావస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం సాయం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. ఏటా వేట నిషేధ సమయంలోనే ఇచ్చే సొమ్ములు అసలు అందుతాయో లేదోనని గంగ పుత్రులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 5 తీర ప్రాంత మండలాలుండగా 58 మత్స్యకార గ్రామాలున్నాయి. దాదాపు 2 లక్షల మంది ఫిషర్ మేన్స్ ఉన్నారు. సముద్ర వేట ద్వారా 36 వేల మంది ఉపాధి పొందుతున్నారు. 467 మేకనైజ్డ్ బోట్లు, 3779 మోటారు బోట్లు, 399 సంప్రదాయ బోట్లు ఉన్నాయి.



**పరిహారంలో తీవ్ర జాప్యం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి రెండు నెలలపాటు వేట నిషేధాన్ని అమలు చేస్తారు. చేప పిల్లల వృద్ధి చెందడం కోసం ఈ కార్యక్రమాన్ని పక్కాగా అధికారులు అమలు చేస్తున్నారు. ఆ సమయంలో చేపల వేట లేకపోవడంతో మత్స్యకార కుటుంబాలన్నీ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పరిహారంగా రూ.10 వేలు అందిస్తుంటాయి. దీని వల్ల ఆయా కుటుంబాల్లో కొంతైనా ఉపశమనం కలుగుతుంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పరిహారం సకాలంలోనే అందేదని మత్స్యకారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేట నిషేధ పరిహారం విషయంలో జాప్యం చేస్తుండడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిషేధ సమయంలోనే పరిహారం తమ ఖాతాల్లో జమ అయ్యేదని ప్రస్తుతం ఇప్పటివరకు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో 24,147 మందికి పరిహారం అందివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇవ్వాల్సి ఉంది.

**రూ.20 వేలు అందేదెన్నడు**

కూటమి నేతలు తమ ఎన్నికల ప్రచారంలో వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. సందర్భం వచ్చినప్పుడల్లా పరిహారం పెంచి అందిస్తామని, త్వరలోనే ఖాతాల్లో జమ చేస్తామని చెప్పుకొచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తన ఎన్నికల ప్రచారంలో ఇదే విషయంపై పదే పదే ప్రస్తావించారు. పరిహారాన్ని పెంచి త్వరితగతిని ఇస్తామని హామీ ఇచ్చి ఆరు నెలలైనా నేటికీ ఒక్క రూపాయి కూడా జమ కాలేదని మత్స్యకారులు వాపోతున్నారు.తమ వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



**పరిహారం ఇంకా అందలేదు**

గత 6నెలలుగా వేట నిషేధ పరిహారం కోసం ఎదురు చూస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిహారం పెంచుతుందని ఆశించాం. కానీ గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలు పరిహారం కూడా నేటికీ ఇవ్వలేదు. ఇదేమి నిర్లక్ష్యమో అర్థం కావడం లేదు. వెంటనే పరిహారం విడుదల చేయాలి.

- సూరాడ దుర్గారావు, మత్స్యకారుడు, ఉప్పాడ, యు. కొత్తపల్లి మండలం.



**వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇవ్వాలి**

వేట నిషేధ భృతి రూ.20వేలు త్వరితగతిన ఇవ్వాలి. ఏటా వేట నిషేధ భృతి 15 రోజుల నుంచి 20 రోజుల్లో మత్స్యకారుల ఖాతాలో జమ అయ్యేది. 6 నెలలు కావస్తున్నా ఇంతవరకు రూపాయి కూడా పడకపోవడం శోచనీయం. అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్య సంపదను విదేశాలకు ఎగుమతుల రూపంలో భారతదేశానికి ఎంతో ఆదాయాన్ని ఇస్తున్నారు.

- సిహెచ్ రమణి, జాతీయ మత్స్యకార, మత్స్య కార్మిక సంఘం సభ్యులు.

## మంత్రుల వ్యాఖ్యలపై వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

అసెంబ్లీలో మంత్రి బాల వీరాంజనేయ స్వామి వాలంటీర్ల విషయంలో ప్రజలకు అసత్యాలు చెప్తుంటే చంద్రబాబు మౌనంగా ఉండడాన్ని తప్పు పడుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వాలంటీర్ల సంఘం నాయకులు వరుణ్, నందేశ్వరరావు మాట్లాడుతూ 2023 ఆగస్టు తర్వాత వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా 2024 మే వరకు వేతనాలు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. ఎన్నికల విధుల నుంచి వాలంటీర్లను తప్పించాలని హైకోర్టుకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో ప్రజలకు అసత్యాలు చెప్పడానికి మానుకోవాలని, మంత్రి బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లందరినీ కొనసాగించి, రూ.10 వేల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి నేతలకు ఓట్లు వేసి గెలిపిస్తే ఇలా అబద్ధాలు చెప్పి నమ్మకాన్ని పోగొట్టుకోవద్దని, అవసరమైతే వాలంటీర్లందరిని సమీకరించి కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అడక్కుండా హామీలు ఇచ్చి, అడుక్కునేలా చేశారని నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ప్రకాష్, ఎవి.గంగాధర్, ఇ.వరుణ్ కుమార్, సంతోషి, లక్ష్మీ ప్రసన్న, భవాని, నాగలక్ష్మి, త్రిపుర సుందరి, భ్రమరాంబిక తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వాలంటీర్లు

## వేతనాల కోసం మిడ్డే మీల్స్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

తమ బకాయి బిల్లులు వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, కంజెంటెండ్ వర్కర్లు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గత రెండు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని, కంజెంటెండ్ వర్కర్లకు ఆరు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ పద్మ మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే పిల్లల సంఖ్యను పెంచడం కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం కోసం మెనూ ఛార్జీలు పెంచి, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేసి పథకాన్ని అభివద్ధి చేయాల్సి ఉన్న పథకాన్ని అభివద్ధి కోసం నిధులను విడుదల చేయకుండా వర్కర్లకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మధ్యాహ్న భోజన కార్మికులు, కంటింజెంట్ వర్కర్లు ఎలా బతకాలని ప్రశ్నించారు. స్కూల్లో కంజెంటెండ్ వర్కర్లు దాదాపు 5 నెలల నుండి జీతాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ మాట్లాడుతూ కార్మిక చట్టాలన్నీ తుంగలోకి తొక్కి కార్మికులను రోడ్డుకీడ్చారన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో దిడ్డి సుబ్బలక్ష్మి, కరకు సుబ్బలక్ష్మి, వరలక్ష్మి, మంగ, ఎరుబండి అమ్మాజీ, రమణమ్మ, యూనియన్ నాయకులు కొప్పిశెట్టి కుమారి, ఎన్.దేవి, బి.లోవలక్ష్మి, కిల్లాడి లక్ష్మి, కాపవరపు నాగరాజు, వి.జ్యోతి, ఎన్.వీర్రాజు, ముప్పిడి లాజర్, కొండా శ్రీనివాస్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## భూములను కాపాడాలని గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగకు చెందిన సుమారు 45 ఎకరాల భూములను కాపాడాలని గ్రామస్తులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు కామాడి మాతరాజు, కొక్కిలిగడ్డ లోకేష్ విలేకరులతో మాట్లాడారు. సుమారు 400 ఏళ్లుగా గాడిమొగ ఆరుగురు గ్రామదేవతల ఉత్సవాలు, జాతరలకు సంబంధించి 45 ఎకరాల భూములలోని మట్టిని ఉపయోగిస్తున్నామని తెలిపారు. అటువంటి భూముల్లో బాబా నగర్ గ్రామానికి శ్మశాన వాటిక భూమిని కేటాయించడం తగదన్నారు. ప్రభుత్వం సహకరిస్తే గ్రామ పంచాయతీ, గ్రామం తరపున బాబా నగర్ గ్రామానికి అవసరమైన శ్మశాన వాటిక స్థలం కొనుగోలు చేసి ఇస్తామని అన్నారు. మల్లాడి జయనారాయణ, కొక్కిలిగడ్డ గంగాధర్, కొప్పాడి లక్ష్మణస్వామి, లంకె వీరబాబు, దోమ వెంకటేశ్వర్లు, సంగాడి వెంకటేశ్వర్లు, కాలాడి తాతారావు, సంగాడి కామేశ్వరరావు, కామాడి మాతరాజు, కొప్పాడి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



భూముల వద్ద ధర్నా చేస్తున్న గాడిమొగ గ్రామస్తులు



మరమ్మతు పనులు చేపట్టిన సిబ్బంది

## మరమ్మతు పనుల ప్రారంభం

ప్రజాశక్తి-కాజులూరు

రహదారుల మరమతులకు రూ.32 లక్షల నిధులు మంజూరు అయ్యాయని రోడ్లు శాఖ జెఇ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని కోలంకలో ఆమె మాట్లాడుతూ కోలంక నుండి కాపుల పాలెం బైపాస్ వరకు మరమ్మతులు నిమిత్తం నిధులు మంజూరు కావడంతో పనులను యుద్ధ ప్రాతిపదిగిన ప్రారంభించి 15 రోజులలోపు పూర్తి చేస్తామమని తెలిపారు. వెట్ మిక్స్‌తో 3 రోజులు పాటు వేసిన అనంతరం బిటి రోడ్డు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ నల్ల బాలాజీ, డి.దొరబాబు, మేడిశెట్టి కుమార్ పాల్గొన్నారు.

## మురుగు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలు నగర పంచాయితీ ఎస్‌సి కాలనీలో డ్రైనేజీ మురుగు నీరు పారక ఇళ్ల మధ్యలో నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుచున్నారు. స్థానికులు తెలిపిన ప్రకారం 15 రోజులుగా మురుగు నీరు డ్రైనేజీ పారకుండా నిలిచిపోయిందని, ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అనేకరకలైన దోమలు పురుగులు ఇళ్లలోనికి వస్తున్నాయని దీనివల్ల డెంగీ మలేరియా వ్యాధుల బారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## 26న కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న కాకినాడలో జరప తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని మండల ప్రజాసంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా ప్రచార పోస్టరు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను అదుపులో చేయడంలో విఫలమయ్యాయన్నారు. ఈ ఆందోళనను జయప్రదం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డి ఏడుకొండలు, దుప్పి అదృష్ట దీపుడు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, పి.అనంతలక్ష్మి, వి.మరియమ్మ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఈ నెల 26న తాళ్లరేవు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిషత్ సాధారణ సమావేశం ఈ నెల 26 ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కె.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానిత ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలన్నారు.

## సకాలంలో బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఖరీఫ్ 2024-25 ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబంధించి రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు సకాలంలో సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఖరీఫ్ 2024-25 సీజన్ ధాన్యం సేకరణ సన్నద్ధతలో భాగంగా జిల్లాలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో జెసి రాహుల్ మీనా పౌరసరఫరాల సంస్థ, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలింపు, గోనె సంచులు, బ్యాంకు గారెంటీలు, సిఎంఆర్ తదితర అంశాలపై జెసి రాహుల్ మీనా రైస్ మిల్లర్లతో చర్చించారు. ఈ సందర్భంగా జెసి రాహుల్ మీనా మాట్లాడుతూ ఖరీఫ్ 2024-25 సీజన్ రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 277 రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతోందన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ సక్రమంగా జరిగేందుకు రైస్ మిల్లర్లు సహకారించాలన్నారు. రైస్ మిల్లర్లు సకాలంలో బ్యాంకు గారెంటీలు సమర్పించాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోను సంచులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సిఎంఆర్ బియ్యాన్ని అందించాలని ఆయన రైస్ మిల్లర్ల ప్రతినిధులు సూచించారు. రైస్ మిల్లర్లు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.దేవుల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవి.ప్రసాద్, రాష్ట్ర రైస్ మిల్లర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె. సూర్య ప్రకాష్, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యలో లైబ్రేరియన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లైబ్రేరియన్ డెవలప్మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా జరిగిందని గ్రంథాలయ అధికారి కె.అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించగా ఎన్ఐటి వరంగల్ డిప్యూటీ లైబ్రేరియన్ డాక్టర్ ఇరాన్ ఎం.సెట్టర్, కిర్లోస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ పూణె లైబ్రేరియన్ డాక్టర్ ఆర్‌కె.కిషోర్ పట్నాల, ఆదిత్య యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాలకు చెందిన వివిధ కళాశాలల నుండి గ్రంథాలయ విభాగం అధికారులు ఈ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పటి గ్రంథాలయ వ్యవస్థకు నేటి గ్రంథాలయ వ్యవస్థకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. తమ యూనివర్సిటీలో మెరుగైన లైబ్రరీ సేవల కోసం ఆర్టిఫిషల్ ఇంటెలిజెంట్ ఇన్నోవేటివ్ టూల్స్‌ను ఉపయోగించడంపై జాతీయ స్థాయి లైబ్రేరియన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థికి కావలసిన సమాచారం తక్కువ సమయంలో పొందే విధంగా అందుబాటులో ఉంచాలని వేగంగా అభివద్ధి చెందుతున్న ఈ విజ్ఞాన ప్రపంచంలో కాలానుగుణంగా విద్యార్థికి కావలసిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని తెలిపారు.



సదస్సులో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు




ఆందోళన చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

## 29వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన నిరసన దీక్షలు 29వ రోజు శుక్రవారం కొనసాగాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలక వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్ల ఆందోళనలతో నగరంలో చెత్త పేరుకు పోయినా అధికారులు సమస్యలు పరిష్కారం చేయాలనే శ్రద్ధ కనిపించడం లేదన్నారు. క్లాప్ డ్రైవర్ల జీతాల కోసం మున్సిపల్ ఆఫీస్ వారు పంపించిన రూ.30 లక్షల బిల్లు ఎక్కడ ఆగిందో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి జీతాలు వేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ఇస్మాయిల్, శివశంకర్, గంగాధర్, దుర్గాప్రసాద్, శివ, రాజు, కుమార్, వెంకటేష్, రమణ, శ్రీను, అప్పన్న, దుర్గ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 24న నాగులపల్లిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

ఈ నెల 24న నాగులపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగులపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పేర్లు నమోదు చేసుకుని కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. నాగులపల్లి శివాలయం సెంటర్ వద్ద ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి శుక్లాలు, ఇతర కంటి సమస్యలు ఏమున్నా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు.


**కార్టూ'నిజం'**




# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని అంశాలలో సర్వతోముఖాభివద్ధి సాధించే దిశగా హెచ్ఎంలు ప్రణాళిక ప్రకారం కషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించిన విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ విగ్రహానికి డిఇఒ పి.రమేష్‌తో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల నివారణకు చర్యలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణామాలపై అవగాహన, మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్స్ నిర్వహిణ, ఉపాధ్యాయులు హాజరు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, అపార్ నమోదు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు, పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానో పాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితర పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది ప్రత్యేక పాత్రని, విద్యార్థులు అన్ని అంశాల్లో సర్వతోముఖాభివద్ధి సాధించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలూ ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారు. సమాజంలో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా నిలిచేందుకు, తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోనేందుకు అవసరమైన జీవన నైపుణ్యాలను పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు అలవర్చాలన్నారు. చిన్నపిల్లల లైంగిక వేధింపులకు గురికాకుండా ఉండేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలు బారిన పడకుండా ఉండేందుకు విద్యార్థులను రోజు ఉపాధ్యాయులు నిశిత పరిశీలన చేసి సరైన మార్గదర్శనం చేయాలన్నారు. జిల్లాలో నూరు శాతం ఉపాధ్యాయులు హాజరు నమోదయ్యేలా మండల విద్యాశాఖ, ప్రధాన ఉపాధ్యాయులు చూడాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ కింద జిల్లాలో 49 సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విజ్ఞాన శాస్త్రాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే విధంగా పలు ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. ఈ ల్యాబ్‌ల సక్రమ నిర్వహణకు ఆరు నెలల పాటు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు శాశ్వత సంఖ్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంటు రిజిస్టర్‌లో భాగంగా (అపార్) కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థుల విద్య వివరాలను భద్రపరుస్తారన్నారు. జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియలో వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అపార నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్, ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. రానున్న డిసెంబర్ 7న నిర్వహించే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పదోతరగతి పరీక్షలకు మూడు నెలల మాత్రమే సమయం ఉందని పబ్లిక్ పరీక్షల దష్ట్యా పదోతరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. వివిధ అంశాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద నాణ్యమైన, శుచి శుభ్రతతో కూడిన రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించేలా ప్రాధానోపాధ్యాలు సక్రమ పర్యవేక్షణలో చేయాలని సూచించారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి




పర్యవేక్షణ చేస్తున్న సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు

## విజయవంతంగా కౌశల్ పరీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

కౌశల్‌పాఠశాల స్థాయి పరీక్ష విజయవంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేశ్ తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు కౌశల్ పాఠశాల స్థాయి పరీక్షను అన్ లైన్‌లో నిర్వహించినట్టు తెలిపారు. కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలకు నిర్వహిస్తున్న 234 పాఠశాల నుంచి 3124 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారని తెలిపారు. ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ జిల్లా స్థాయికి 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి డిసెంబర్ 6న నిర్వహిస్తామని తెలిపారు. ఎస్.మోహన్ రెడ్డి, ఎస్.వెంకటేశ్వర రావు, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుమార్తె అదృశ్యంపై ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాల ప్రకారం.మండలంలోని సిహెచ్.గున్నేపల్లి గ్రామానికి చెందిన కటిక రెడ్డి అమ్మాజీ భర్తతో విడిపోయి కొంత కాలంగా పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి పనుల విషయంలో తల్లి మందలించడంతో అమ్మాజీ ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఆమె కోసం చుట్టుపక్కల ఇళ్లలో, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి గాలిదేవర అనంతలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటే తరచూ భార్యను వేధిస్తున్న భర్త మరియు అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన మోర్త దీవెనకుమారికి సంవత్సరం క్రితం ముక్కామల గ్రామానికి చెందిన మోర్త నరేంద్రతో వివాహం అయ్యింది. పెళ్లి సమయంలో రూ.మూడు లక్షలు కట్నం ఇచ్చారు. కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. ఇటీవల కాలంలో భర్త నరేంద్ర అత్తమామలు అదనపు కట్నం తేవాలంటూ కుమారిని వేధించడంతో ఆమె పుట్టింటికి వచ్చింది. శుక్రవారం ఆమె స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఆమె ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

## పేకాడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20,100, పేకలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## వృద్ధునిపై వ్యక్తి దాడి

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం ఒక వృద్ధునిపై ఒక వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక పలావ్ సెంటర్లో పని చేస్తున్న మడికి అప్పారావుతో మద్యం సేవించి వచ్చిన పలివెల వెంకటేష్ ఘర్షణ పడ్డాడు. కూరగాయలు తరిగే చాకుతో అప్పారావుపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ అప్పారావును స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ మోహన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దాడుల్లో పాల్గొన ఎక్సైజ్ సిబ్బంది

## సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాల, ఎం.చామవరం, శృంగవరం గ్రామాల్లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి ఆధ్వర్యంలో శుక్రవారం సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. ఎస్.పైడిపాలలో 5800 లీటర్ల నాటు సారా తయారీకి అవసరమైన బెల్లపు ఊటనుప ధ్వంసం చేశామని, ఎం.చామవరంలో 1200 లీటర్ల బెల్లపు ఊటను 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఒకి వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. శృంగవరంలో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

## బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా కట్టమూరులో 600 లీటర్లు, మర్లావలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా తయారీ, అమ్మకాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా 0884-2376227కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.




ప్రమాదంలో దెబ్బతిన్న కారు

## ఢీకొన్న కారు, బస్సు ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-కాకినాడ రోడ్డు ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆర్టిసి బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం కాకినాడ రోడ్డులో ఎదురెదురుగా వెళుతున్న బస్సు, కారు ఎదురుగా ఢీకొన్నాయి. బస్సులో ప్రయాణికులు, కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలూ కాలేదు. ఎస్ఐ అడపా గరగారావు సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

# యానాం వార్తలు



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

## రోడ్లు, డ్రెయినేజీలకు ఎంఎల్ఎ భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

స్థానిక అయ్యన్న నగర గ్రామంలో సుమారు రూ.20 లక్షలతో రోడ్లు డ్రైన్ల పునర్నిర్మాణానికి స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం భూమి పూజ చేశారు. భారీ వర్షాలకు వరదలకు రోడ్లు రైలు పూర్తిగా మునిగిపోవడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంఎల్ఎ అశోక్ స్పందించి పనులను ప్రారంభించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎంఎల్ఎకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, స్లమ్ క్లియరెన్స్ బోర్డు జెఇ భాస్కరన్, ఎస్ఐ మురుగానందం, కాంట్రాక్టర్ గాలి వీరభద్రరావు గ్రామస్తులు లంకే లోవరాజు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

## గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహ నిర్మాణ లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక అతిథి గృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం ఐదు విడతలకు సంబంధించి సుమారు 74 మంది లబ్ధిదారులకు రూ.81 లక్షల 70 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపికగా స్నాన ఘట్టం నిర్మాణం

ప్రజాశక్తి-కరప

తల్లిదండ్రుల జ్ఞాపకంగా స్నానాల ఘట్టం నిర్మించడం అభినందనీయమని యండమూరు గ్రామ సర్పంచ్ మారెళ్ల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కరప మండలం యండమూరులో గుర్రాల రాముడు, గుర్రాల గంగారత్నం దంపతుల జ్ఞాపకార్థం నిర్మించిన స్నానాల ఘట్టాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వీరి కుమారుడు గుర్రాల రాజుబాబు రూ.1.20 లక్షల ఆర్థిక సాయంతో ఈ స్నాన ఘట్టం నిర్మించారన్నారు. ఇన్నాళ్లు అంత్యక్రియలు అయిన తర్వాత చెరువులో స్నానం చేసేవారిమని, చెరువులు అపరిశుభ్రంగా ఉండడంతో స్నానాలు చేయకుండా వెళ్లిపోవడం జరిగేదని తెలిపారు. ఈ సమస్యను గుర్తించి స్థానాల ఘట్టాన్ని నిర్మించిన కుటుంబికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాన్ సూర్య ప్రకాష్, అంబేద్కర్ యువజన సంఘ కార్యదర్శి ప్రత్తిపాటి బుల్లిరాజు, వడ్డపాటి గోపి, బొమ్మతి కృష్ణ, నందికోళ్ల శ్రీను పాల్గొన్నారు.



సిబ్బందికి అవార్డులు అందిస్తున్న జిల్లా ఎస్‌పి

## నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లాలోని ప్రజలు నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సూచించారు. వేట్లపాలెం గ్రామంలో జరిగిన చోరీ కేసును చేదించిన పోలీస్ సిబ్బందికి పెద్దాపురం డిఎస్పీ డి.శ్రీహరి రాజు సమక్షంలో అవార్డులు అందజేసే కార్యక్రమం శుక్రవారం ఎస్‌పి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలంతా నేరాలు, చోరీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి వ్యాపారులు, గృహ యజమానులు వారి వ్యాపార సంస్థల్లో, ఇళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చోరీ కేసును త్వరిత గతిన చేదించిన క్రైమ్ బ్రాంచ్ ఎఎస్ఐ గంగిరెడ్డి బలరామ్, హెచ్‌సిలు శ్రీహరి, రాధాకృష్ణ, పిసిలు నాగేంద్ర, చౌదరి, అంజి తదితరులు సుమారు 15 మంది సిబ్బందికి ఎస్‌పి ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు.

## వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలోని 9, 11, 22, 24 వార్డులలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ బి.ఆదినారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనులు నిర్వహించారు. ఐదుగురు మేస్త్రిలు, ఆరుగురు సానిటరీ సెక్రటరీల ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ఈ నాలుగు వార్డులలో పరిశుభ్రతా పనులు, డ్రైన్లలో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ మేస్త్రీలు బి.సూరిబాబు, జె.రాజబాబు, బి.ప్రభాకర్, టి.అర్జీబాబు, సానిటరీ సెక్రటరీలు జయరామ్, దుర్గాప్రసాద్, వరప్రసాద్, వెంకటరమణ, దాదాజీ, ప్రత్యూష, భవాని, హైమ, సత్తిబాబు పాల్గొన్నారు.

## వన భోజనాలతో సామాజిక బంధాల పెంపు

ప్రజాశక్తి-ఏలేశ్వరం



వన భోజనాల్లో పాల్గొన్న సంఘం సభ్యులు

సమాజంలో పెరిగిపోతున్న మనుషుల మధ్య అంతరాలను తగ్గించేందుకు వనభోజనాలు దోహదం చేస్తాయని ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వనభోజనాలలో సభ్యులందరూ కుటుంబాలతో సహ హాజరై పలు క్రీడ పోటీల్లో పాల్గొన్నారు. ఉదయం నుండి ఆటపాటలతో ఆనంద ఉత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, ప్రకతి పరిరక్షణ సంఘం నాయకులు గోళ్ల నాగేశ్వరరావు, జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, కరోతు సత్యనారాయణ, వేల్పుల సూరిబాబు, రౌతు సహదేవుడు, చందువోలు రాజా, నారాయణరావు, సిరిపురపు రాజేష్, పెచ్చేటి కృష్ణ, తాళ్లూరి గొల్లాజిరావు, కోట శ్రీనివాస చక్రవర్తి ఉన్నారు.




చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు

## 10న సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవమైన డిసెంబరు 10న చేపట్టిన సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడ సభను విజయవంతం చేయాలని ఎపి సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కెవి.బాషా, డి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఎపి జెఎసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత ప్రభుత్వ హయాంలో వారంలో సిపిఎస్. రద్దు హామీ నిలబెట్టుకోలేదని, దీంతో పాటు పిఆర్‌సిలో అన్యాయం, డిఎ విడుదలలో జాప్యం, సరెండర్ లీవ్‌ల ఎన్ క్యాష్ మెంట్ కూడా జరగలేదని రామ్మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంఓల పసుపులేటి శ్రీనివాస్, ప్రదీప్, డాక్టర్. ఎం.రవికుమార్, పి.వెంకట కృష్ణ, మూర్తి బాబు, ఎం.వెంకటేశ్వరరావు, సత్తి రాజు, చింతా నారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి అలీం, జిల్లా అసోసియట్ అధ్యక్షుడు నూకరాజు, వాకాడ వెంకట రమణ, శ్రీరాములు, నరేష్ పాల్గొన్నారు.

## డెంగీ, మలేరియాపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన గొల్లప్రోలు శివాలయం పంచాయతీ నగర్ ప్రాంతాలలో డెంగీ మలేరియా వ్యాధులపై ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసుపత్రి పర్యవేక్షులు జి.శ్రీనివాసరావు, అహ్మద్ బాషా మాట్లాడారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో జనసముదాయాల్లో ఇంటింటా డెంగీ మలేరియా వ్యాధులు దోమకాటుతో వచ్చే వెక్టర్ డిసీజెస్ కంట్రోల్ దిశగా నీటి నిలువలు వారంతపు రోజులలో మార్చాలని, మూతలు వేసి ఉంచాలని, ఏడిస్ లార్వాను ఎలిమినేట్ చేయాలని, టైర్స్, జాడీలు, కూలర్స్‌లో డెంగీ ఏడిస్ మలేరియా అనాఫిలస్ దోమలు గుడ్లు పెడతాయని, వాటి ద్వారా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

జ్వరం వస్తే ల్యాబ్ పరీక్షలు చికిత్స అవసరం మేరకు మందులు వాడి నివారణ చేపట్టాలని సిబందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎఎన్ఎం లక్ష్మణ కుమారి, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కాజులూరు

బాలిక, మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పల్లిపాలెం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు వరదా రామలక్ష్మి భవాని, భారతీ దేవి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీధర్ అధ్యక్షతన బాలిక, మహిళల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు మాట్లాడుతూ విద్యార్థులు బాలిక మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ఈవ్ టీజింగ్ గురించి ఎల్ఇడి స్క్రీన్‌పై వివరించారు. విద్యార్థులకు ఏ ఇబ్బందులు కలిగినా ఉపాధ్యాయులు, లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కామేశ్వరరావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహారాణి బుచ్చి సీతయ్యమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం



సీతయ్యమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది

మహారాణి సత్రం వ్యవస్థాపకులు పెద్దాపురం మహారాణి శ్రీ రాజా వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ 189వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మహారాణి సత్రంలో పేదలకు అన్నదానం, వస్త్ర దానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు సత్రం ఆవరణలోని మహారాణి బుచ్చి సీతయ్యమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ మాట్లాడుతూ 1828లో అప్పటి ఆర్థిక, సామాజిక పరిస్థితులను దష్టిలో పెట్టుకుని పెద్దాపురం మహారాణి బుచ్చి సీతయ్యమ్మ అన్నార్తులకు, పేదలకు అన్నదానం నిమిత్తం ఈ సత్రం ఏర్పాటుచేసి అందుకు అవసరమైన భూములను కేటాయించారన్నారు. ఆనాడు ఈ సత్రంలో రాజేసిన పొయ్యి ఈనాటికీ ఆరకుండా అన్నదానం జరుగుతూనే ఉందన్నారు. ఈ సత్రంలో అన్నార్తులకే కాకుండా విద్యార్థులకు కూడా భోజనాలు పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పిఎన్‌విజిబి.శ్రీవాణి, ఎన్.రాజబాబు, సిహెచ్‌డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జైల్‌ను సందర్శించిన ప్రకాష్ బాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ బాబు శుక్రవారం పెద్దాపురం సబ్ జైలును సందర్శించారు. సబ్ జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలకు అమలు చేస్తున్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పిటిషన్ వంటి న్యాయ సహాయం అంశాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ వై.శ్రావణ్ కుమార్, మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లు మడికి రాంబాబు, అత్తిలి ప్రభూజీ, ఎస్.దుర్గారావు, పారా లీగల్ వాలంటీర్లు బి సూర్యనారాయణ మూర్తి, ఎన్.అప్పలకొండ, కెవివి.లక్ష్మి, విజయ, డి.లక్ష్మి, రమణ, నాని బాబు, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ సభల్లో 566 ఫిర్యాదులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించిన రీ సర్వే గ్రామసభల్లో ప్రజల నుండి రికార్డుల్లో తప్పులు సరిచేయాలని 566 ఫిర్యాదులు అందాయని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అత్యధికంగా కాండ్రకోట గ్రామంలో 103 ఫిర్యాదులు అందజేయగా తాటిపర్తి, గుడివాడ గ్రామాల్లో ఒక్కొక్క ఫిర్యాదు మాత్రమే అందజేశారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదులన్నీ 15 రోజుల్లోగా పరిశీలించి సరిదిద్దుతారన్నారు. ఈ ఫిర్యాదుల్లో చిన్న చిన్న తేడాలు ఉంటే గ్రామ సర్వేయర్, విఆర్‌ఒలు సరిదిద్దుతారని, రికార్డులలో మార్పులు, చేర్పులు వంటివి మండల స్థాయిలో సరిదిద్దుతారన్నారు.

## 26న కలెక్టరేట్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి -కరప

కేంద్రంలో బిజెపి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పిలుపు ఇచ్చారు. కరప మండలం వేళంగిలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గణేశుని శ్రీనివాస్ ఆందోళన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గరగ ప్రసాద్, నొక్కు చంటి, కొల్ల దుర్గ, పబ్బినేటి మామాజీ, కబ్బు విజయ్ కుమార్, తాతపూడి రాజు, పల్లా శ్రీనివాస్ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా మంజూరైన పశువుల షెడ్లను ఎంపిడిఒ నాతి బుజ్జి ఆధ్వర్యంలో ఎపిడి భాను ప్రకాష్, ఉపాధి హామీ ఎపిఒ గంగాభవాని పర్యవేక్షించారు. అందులో భాగంగా గండేపల్లిలో శుక్రవారం ఎల్.అన్నవరం పశువుల షెడ్‌ను మురారి గ్రామంలో జె.పద్మనాభ చౌదరి పశువుల షెడ్‌ను అధికారులు పరిశీలించారు. గండేపల్లిలో రూ.30 లక్షలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించారు. ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇసి పి.రమేష్, టెక్నికల్ అండ్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇటిసి ప్రిన్సిపల్ వేణుగోపాల్

## రాష్ట్ర స్థాయి శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో రెండు రోజులపాటు ఏజన్సీ ప్రాంతాల పరిపాలనకి సంబంధించిన పీసా (షెడ్యూల్ ప్రాంతాలలో పంచాయితీల విస్తరణ) చట్టం గురించి ఇవ్వవలసిన శిక్షణకు సంబంధించి రాష్ట్ర స్థాయి రైట్ షాప్ విజయవంతంగా ముగిసిందని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి రైట్ షాప్ నిర్వహణలో ఎపిఎస్ఐ ఆర్‌డిపిఆర్ విజయవాడ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాల ప్రజలు తమ హక్కులను కాపాడుకునే విధంగా వారి కోసం చేసిన పీసా చట్టంపై వారందరికీ అవగాహన కలిగించేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ రైట్ షాప్ ద్వారా వారందరికీ ఉపయోగపడే మెటీరియల్ తయారుకు అందరం పనిచేయాలని కోరారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

మల్లేపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎం ఎఎస్.ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలను వేసుకోవడం మూలంగా అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ తోట పంట ప్రాముఖ్యత, ప్రత్యేకతల గురించి, కంపెనీ రైతులకు కల్పించే సదుపాయాలు గురించి, పంటను ఆశించే చీడ పీడలు వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హార్టికల్చర్ ఆఫీసర్ పి.లావణ్య మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో వచ్చే తెల్ల దోమ నివారణ, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ సబ్సిడీ, పామాయిలు తోటల్లో అంతర పంటల ఆవశ్యకత, ఉద్యానశాఖ యొక్క రాయితీలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్.వీర్రాజు, జివివిఎస్.దుర్గా ప్రసాద్, హార్టికల్చర్ విహెచ్ఎ.కనకయ్య, రైతులు పాల్గొన్నారు.

## కొండబాబుకు టిడిపి నేతల సత్కారం

ప్రజాశక్తి-గండేపల్లి

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్త కొండబాబును శుక్రవారం సూరంపాలెం గ్రామానికి చెందిన టిడిపి న్యాకులు కుంచే రాజా, పోసిన బాబూరావు, కుంచే రామకృష్ణ ఘనంగా సన్మానించి సత్కరించారు. జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ స్వగహంలో ఈ సన్మానం నిర్వహించారు.

## జోరుగా టిడిపి సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు కుంచే రామకృష్ణ, టిడిపి నాయకులు పోసిన బాబూరావు ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహన రావు హాజరై సభ్యత్వ నమోదు చేయించారు.

## పిబి.దేవంలో అత్యధికంగా 98 అర్జీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పెదబ్రహ్మదేవపురంలో రీ సర్వే సమస్యలపై నిర్వహించిన గ్రామసభలో అత్యధికంగా 98 దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దారు కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పిబి.దేవంలో తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి గ్రామ సభ నిర్వహించారు. కొన్ని సమస్యలపై 98 మంది దరఖాస్తులు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈ సర్వేలో ఏర్పడిన సమస్యలు పరిష్కారానికి తీసుకునే చర్యలను రైతులకు స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామసభలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.